కథా నిలయం
3736
శ్రీకాకుళం

# చక్కెరబొమ్మ

''చక్కెర బొమ్మేవిటి? చెక్కెరబొమ్మ! ఈచనువు ఎవరిచ్చారితనికి?.... అసలితనెవరు? ... "కళ్ళు. చెరువులోని కలువల్లా ఎర్రబారగా ఓ పక్కకోపం మరోపక్క ఏదో చెప్ప లేని మురిపెం, ముంచుకొస్తూండగా, కళ్ళ చివరనుంచి ఓర చూపుల్తో చూసింది గాయత్రి. అవతలవ్యక్తి ఏం ఎరగనట్టు స్నానం పూర్తిచేసి టవల్‌తో తల తుడుచుకుంటున్నాడు.

మనిషి చూస్తే పచ్చగా పాతికేళ్ళ పరవంతో తొణికిస లాడుతూ మంచి పర్సనాలిటీతో చుడ్డానికి బాగానే ఉన్నాడు అతడన్న మాటే బాగోలేదు. బాగో లేదంటే పూర్తిగా బాగో లేదనికాదు. అలా అతనన్నప్పుడు తనవళ్ళు ఝుల్లుమంది. నిజమే- కాని అసలు బొత్తిగా పరిచయం లేని వ్యక్తి అంత చనువుగా తనని అనడం ఏవిటి? అదే ఇబ్బందిగా ఉంది గాయత్రికి-పోనీ అని అతని పట్ల కోపం తెచ్చుకొని "ఎవరు నువ్వు? నన్నెందుకు చక్కెరబొమ్మ అన్నావు?" అని నిలదీసి అడిగి జగడం పెట్టుకుందాం అనుకుంటే, మనస్సు అందుకు ఒప్పుకోవడంలేదు- అలా అతననడం మనస్సుకి ఇష్టమేమో! ఏమో! అయినా అతనేమంత కానిమాట అన్నాడని? "చక్కెర బొమ్మ." అనడంతప్పా?.... ఆ మాట తలుచుకుంటేనే తనకి

సిగ్గు ముంచు కొస్తోంది. ఇంతకీ ఆమాట తనని ఉద్దేశించే అన్నాడని నిర్ధారణ ఏమిటి? .... నిర్ధారణకాక? .... ఇంకెవరున్నారు. ఇక్కడ నీళ్ళుపట్టికెళ్ళడానికి వచ్చిన తనూ, స్నానం చెయ్యడానికి వచ్చిన అతనూ - ఈ సంధ్యావేళ రేవులో మూడో మనిషి ఎవరూ లేరే? అనుమానం లేదు. అతనన్నది తననే?

గాయత్రి ఇదీ అని చెప్పలేని మధురమైన ఆలోచనలతో ఉక్కిగబిక్కిరి అవుతోంది.

ఎదురుగా చెరువునిండా ఎర్రి కలువలు కలకల్లాడుతూ కన్నుల పండుగ చేస్తున్నాయి. బాతులు జంటలు జంటలుగా ఆ కలువ పువ్వుల మధ్య ఈదుతున్నాయి. అస్తమిస్తూన్న సూర్యకిరణాలుపడి చెరువులో నీళ్ళన్నీ పారాణిలా మెరుస్తున్నాయి. ఆ చెరువూ, ఎర్రికలువలూ, బాతులూ, చల్లని గాలీ - ఇవన్నీ తనకి చిన్నప్పటి నుంచీ పరిచయమైనవే! ఇంకోలా చెప్పాలంటే అవన్నీ తన ప్రాణస్నేహితులు. అవును మరి! అవితప్ప తనకి ఊళ్ళో స్నేహితులేరి? తనలా పదహారేళ్ళ వయస్సులో ఉండి తనతో మాట్లాడ గలిగే అమ్మాయిలెంతమంది ఉన్నారు? గాలికి ఎగిరే పైటని అదిమి పట్టుకుంటూ, కళ్ళల్లోకి పడుతూన్న ముంగురుల్ని సవరించుకుంటూ, తనలో తాను పరవశించిపోతూ, ఓ మారు చెరువులోని ఆ సాయంత్రపు అందాల్ని, ఓ కంట స్నానం ముగించి

ఠీవిగాగట్టు ఎక్కబోతూన్న ఆ అబ్బాయి సౌందర్యాన్ని, చూస్తూ మరో లోకంలో ఉండిపోయింది. గాయత్రి.

"పేరు అడగ వచ్చా?"

చెవుల్లో గుసగుసలాడినట్లు వినపడిన ఆ మాటలకి గాయత్రి వళ్ళంతా పులకరించింది. మనస్సులోంచి ఏదో కులుకు బయలుదేరి పెదిమలమీదకి నవ్వులా వచ్చింది. అప్పుడో లేని ఆనందం - ఆవెంటనే బిడియం - రెండు చేతుల్తోటీ ముఖం కప్పుకొని చెరువు గట్టుపై ఉన్న పెద్ద గచ్చు తులసి కోట వెనక్కివెళ్ళి దాక్కొంది గాయత్రి. దాక్కొందే కాని వళ్లు ఇంకా ఝల్లుమంటూనే ఉంది. క్రింది పెదవి అదురుతూనే ఉంది. అతని పలకరింపు ఉండుండి చెవిలో వినిపిస్తూ గుండెని కుదిపేస్తూనే ఉంది. శరీరం అంతా సిగ్గుతో ముడుచుకుపోతుంటే తెగ ఇబ్బంది పడుతూ, గచ్చు తులసికోట వెనక నుంచి తొంగి తొంగి చూస్తోంది గాయత్రి.

"అది కనిపెట్టాడతను. సిగ్గులమొగ్గ! అంటూ తనలో తను నవ్వుకున్నాడు. వెంటనే అతని కో ఆలోచన వచ్చింది. గాయత్రి మెట్లమీద వదిలి వెళ్ళిన బిందె తీసుకుని, దాని నిండా తేటనీరు నింపాడు. రెండు కలువ పువ్వులుతుంచి బిందెలో వేశాడు. గోరుతో తామరాకుమీద ఏదోరాసి, ఆ ఆకుని బిందెమీద మూతగావేసి, ఏమీ ఎరగనట్లు గట్టు మీదకి వచ్చి తులసికోట వెనకనుంచి దొంగ చూపులు చూస్తూన్న

గాయత్రిని ఓరకంటతో చూసి, ముసి ముసి నవ్వులునవ్వు కుంటూ, వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళాడు.

తులసికోట వెనుక నుంచి నెమ్మదిగా ఇవతలకివచ్చి అతను కనిపించి నంతవరకు కళ్ళప్పగించి చూస్తూ ఉండి-పోయింది గాయత్రి. మధ్యలో అతను వెనక్కి తిరిగి చూసి నవ్వాడు మాత్రం తత్తరపడి సిగ్గుతో దాక్కుంది. తర్వాత బరువెక్కిన గుండెల్ని చేత్తోరాసుకుని, దీర్ఘంగా నిట్టూర్చింది.

"అమ్మో చీకటిపడి పోయింది. బామ్మ కేకలేస్తుంది" అనుకుంటూ గబ గబా నీళ్ళుముంచు కుందాం అని చీడీలు దిగింది. బిందెదగ్గరికి వెళ్ళేటప్పటికి దాన్నిండా నీళ్ళూ ఆనీళ్ళలో కదులుతున్న కలువలూ, పైన సుతారంగా మూత వేసిన తామరాకూ కనిపించాయి. ముందు విస్తు పోయింది. తర్వాత అర్థం అయి నవ్వుకుంది. కలువ పువ్వుల్ని మనసు దీరామళ్ళీ మళ్ళీ ముద్దుపెట్టు కుంది. ఇంతలో ఆకుమీద గోటితో రాసిన అక్షరాలు కనిపించాయి.

'ఓసిగ్గుల మొగ్గా, నీపేరేమిటి?
కలువ కన్నెవా, చక్కెరబొమ్మవా?'

పారిజాత వృక్షాన్ని కుదిపినట్లు గాయత్రి ఒళ్ళంతా పులకింతలతో జవ జవలాడి పోయింది. "ఛీ .... ఏవిటీ రాతలు ? ఎవరికేనా తెలిస్తే? అసలు ఎవరితను ? ఒక

క్షణంలో తన హృదయాన్ని ఏదోలాచేసిన ఈ అబ్బాయిని తను ఇంతకిత్రం ఎప్పుడూ చూడలేదు. ఎవరింటికో చుట్టంగా వచ్చి ఉంటాడు కాని ఈఊరు అయి ఉండదు.

మనస్సులో ఏవేవో మధురమైన భావాలు సందడి చేస్తూంటే. తడబడు తూన్న తనగుండెకి, చంకన ఉన్న బిందెలోనీళ్ళులయ వేస్తూంటే ఊహాలోకాల్లో విహరిస్తూ, మబ్బుల్లో తేలి పోతూ, నెమ్మదిగా అడుగు కదిపింది గాయత్రి.

గుమ్మంలో అడుగు పెడుతూండగానే బామ్మ గయ్యి మంది. "ఎంతసేపయిందే నీళ్ళకని - వెళ్ళి? ఇప్పుడారావడం? ఆలశ్యం ఎందుకయింది? .... చెప్పు .... ఊ" అంటూనిలేసింది. గాయత్రి బెదురుతూ "రేవులో ఎవరో స్నానం చేస్తూంటేనూ, ఆయున వెళ్ళేదాకా ఆగి, నీళ్ళు ముంచుకో వలసి వచ్చింది. అందుకని ..." అంటూ వాక్యం పూర్తి చెయ్యకుండా ఆగిపోయింది.

"నువ్వు సిగ్గుపడి ఆగిపోవలసిన మనిషి ఎవరున్నారే ఈ ఊళ్ళోను? అందరూ తెలిసిన వాళ్ళే కదా!"

"ఆయనది ఈ ఊరయి ఉండదు బామ్మా.... ఏదో పట్నంనుంచి".

"మరే ...పట్నంనుంచి నిన్ను ఎగరేసుకుని పోవడానికి వచ్చాడు."

బామ్మ అన్న మాటలకి గాయత్రి ముఖంలో సిగ్గు దొంతరలు ముంచుకు వచ్చి చెక్కిళ్ళు రెండూ విచ్చిన మందారాల్లా అయ్యాయి. మనవరాలి ముఖంలో వచ్చిన ఈ మార్పుని ముసిలామె ఇట్టే పసి గట్టింది. ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా ఆమె కళ్ళల్లో తళుక్కు మంది గాయత్రి మనస్సుని ఆకట్టుకున్న ఆ అబ్బాయి ఎవరై ఉంటారు చెప్మా?

అన్నం వడ్డించి దగ్గరగా కూర్చుని తల నిమురుతూ "అసలు ఏం జరిగిందే?.... చెరువు దగ్గర ఏం జరిగిందో చెప్పు" అంటూ బుజ్జగించి అడిగింది బామ్మ. బామ్మ ఆప్యాయత చూసే సరికి గాయత్రి కళ్ళు నీళ్ళతో నిండాయి. డగ్గుత్తికతో కాస్సేపు మాట్లాడ లేదు. తర్వాత ఏదో చెప్ప బోయింది. కాని సిగ్గు అడ్డు వచ్చి ఏం చెప్పలేక ఆగి పోయింది.

"సిగ్గు పడకే తల్లీ ....నువ్వింందాకటి నుంచీ కూని రాగాలు తియ్యడం కులుకుతూ ఉండడం, అన్నీ చూస్తూనే ఉన్నాలే... చెప్పు... అసలు ఏమైందో...."

బామ్మ ఆప్యాయతకి కరిగి పోయి. మాట నానుస్తూ పొడి పొడిగా "చెరువు దగ్గర....ఒక అబ్బాయి నా పేరు అడిగాడు" అంటూ రెండు ముక్కలు చెప్పింది గాయత్రి.

"చెప్పావా పేరు?" గద్దించి అడిగింది బామ్మ.

"ఊహుఁ!"

"సర్లే....ఎవరో ఏమిటో వాకబు చేసి కనుక్కుని రేపీ పాటికి తేల్చేస్తాను" ధాటీగా అంది బామ్మ.

"బామ్మా .... బామ్మా .... అతను మంచివాడిలాగే ఉన్నాడు బామ్మా" అంది గాయత్రి కంగారు పడుతూ.

"ఊ.... సరే అయితే ఇంకనే!" బామ్మ మాటల్లో వ్యంగం కనిపించింది కాని, గాయత్రికి ఆ చీకట్లో బామ్మ పెదిమల మీద చిరునవ్వు కనిపించ లేదు....................

మర్నాడు అబ్బాయి ఎవరో ఏమిటో వాకబు చెయ్యడానికని బామ్మ ఊళ్ళోకి వెళ్ళింది. మధ్యాహ్నం అనగా వెళ్ళిన మనిషి ప్రొద్దు గుంకుతున్నా రాక పోయేసరికి, ఇంట్లో వేచియున్న గాయత్రి స్థిమితంగా ఉండలేక ఇంట్లోకి, వీధిలోకి తిరుగుతూ తెగ ఆదుర్దా పడ సాగింది. బామ్మ వాకబుచేసి సరిగ్గా అతనెవరో ఎవరింటికి వచ్చాడో ఏమిటో తెలుసుకుందో లేదో! అసలు అతను కనిపించాడా బామ్మకి? కనిపిస్తే ఏం మాట్లాడి ఉంటుందో ఏమో....మా మనవరాలిని పెళ్ళి చేసుకుంటావా అని అడిగి ఉంటుంది. ఛీ.... పోదు....అలా అడిగేసినా అడిగేస్తుంది.....బామ్మకి బొత్తిగా సిగ్గూ మొహమాటం ఏం ఉండవు....నిజంగా అలా అడిగేసి ఉంటుందా?.... దాని కతను ఏం సమాధానం చెప్పి ఉంటాడు... ఆ సమాధానం ఆలోచించే సరికి గాయత్రికి

సిగ్గు ముంచుకొచ్చింది. గట్టిగా రెండు చేతుల్తోటీ ముఖం కప్పుకుంది.... ఎంత సేపటి దాకానో ఉక్కిరి బిక్కిరి అయిపోతూ ఉండిపోయింది.... నెమ్మదిగా కనులు తెరచి చూసే సరికి, ఎదురుగా గుమ్మంలో గులాబులు నవ్వినట్లనిపించింది.... "ఏమమ్మా ఎందుకా తొందర? బామ్మ తియ్యని కబురే పట్టుకొస్తుందిలే–మాకు నీళ్ళు పోసి నువ్వు పోసుకుని ఈ లోగా ముస్తాబు అవు.... ఎంత మనసిచ్చినా అంత ఆదుర్దా పనికిరాదు........ ఆందోళన తగ్గించవే చిట్టి తల్లీ అంటూ పక పక నవ్వినట్లున్నాయి ఆ గులాబులు. దాంతో కోపం వచ్చి పూసిన గులాబుల కేసి చూస్తూ మూతి మూడు వంకర్లు తిప్పింది గాయత్రి.

బామ్మ ఇంకా రాదేమిటీ?

ఇలా అనుకుంటూండగానే బామ్మ వచ్చేసింది. వస్తూనే 'ఉస్సూ'రంటూ గుమ్మంలో చతికిలపడింది. కాళ్ళు రెండూ చేతుల్తో రాసుకుంటూ ఏక ఆపసోపాలు పడసాగింది.....ఎంత సేపటికీ పైట చెంగుతో విసురుకోవడం ఉస్సు రస్సు రనుకోవడమే కాని, బామ్మ ఏం మాట్లాడ్డంలేదు. అసలు ఏం జరిగిందో చెప్పడం లేదు. ఇంకా చెప్తుంది ఇంకా చెప్తుంది అని ఎంతో ఓర్పుతో నిలబడ్డ గాయత్రికి ఓర్పునశించింది....

"ఏమైంది బామ్మా! ఏమైందో చెప్పవేం?" అంది విసుగ్గా

బామ్మ ఒక్కమారు ఆమెకేసి నిశితంగాచూసి "ఏమిటీ ఆ తొందర? అయినా ఇప్పటి పిల్లలకి అంతా తొందరే!" అంది తాపీగా....

"నువ్వింత జాప్యం చెయ్యడం బాగుంది కాని పైగా నాది తొందరా?....ఇంతకీ ఆయనెవరింటికి వచ్చారో ఏమిటో ఆవివరాలేమైనా తెలిశాయా?"

"ఆ....అన్నీ తెలిశాయి. ఈ నాలుగైదు రోజుల్లోనూ ఈ ఊళ్ళోకి వచ్చిన కొత్త అబ్బాయి ఒక్కడే ఒక్కడు.- అతణ్ణే నువ్వు పావంచాల రేవులో చూసి ఉంటావు"

"ఆయన ఎవరట?"

"ఆసిజాణా అప్పుడే ఎన్ని ఆరాలే నీకు? అయితేచేప్తా విను. అతను పరంధామయ్యగారి మేనల్లుడు. మేనమామనీ, అత్తయ్యనీ చూసిపోదాం అని పట్నంనుంచి వచ్చాడట. పట్నంలో ఏదో పెద్ద చదువు చదివాట్ట. ఉద్యోగం కూడా వచ్చిందట....పేరేమిటో తెల్సా?"

"నువ్వు చెబితేకదా?" గాయత్రి కోపంగా అంది.

"తొందరపడకే.... ఆ అబ్బాయి పేరు సూర్యం"

"సూ ర్యం...." తనలో తను రెండు మూడు సార్లు అనుకుంది గాయత్రి. మనస్సంతా అతని రూపంతో నిండి పోయి కదలకుండా కళ్ళు మూసుకుని ఉండిపోయింది.

"ఇంతకీ అతను ఇప్పుడు ఇక్కడలేదు.... ప్రొద్దున్నే తిరిగి పట్నం వెళ్ళిపోయాట్ట!"

"ఆఁ!" గాయత్రి కట్టుకున్న ఆశల మేడలన్నీ ఒక్క మారు కరిగిపోయినట్లు బాధపడి అమట్టునే కూర్చుండి పోయింది.

"బాధపడకే....నేనంతా ఏర్పాటుచేసి వచ్చానుగా? పరంధామయ్యగారిచేత పట్నం ఉత్తరం రాయించాను.... ఇలాఫలానావారి అమ్మాయి గాయత్రి అనిఉంది. చాలా మంచి సంబంధం. ఆసంబంధం చేసుకుంటే బాగుంటుంది. ఓమారు రావలసింది, అనీ - ఇప్పుడే ఉత్తరం డబ్బాలో వేయించి నేనిలా వచ్చాను.... ఏం ఇప్పుడు మనస్సు స్థిమిత పడిందా?"

గాయత్రి ఆనందం పట్టలేక తటాలునవచ్చి బామ్మని కౌగిలించుకొని "మాబామ్మ ఎంతో మంచిది" అంటూ బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది.

బామ్మ వస్తున్న నవ్వుని దాచుకొని కోపం నటించి బుగ్గ తుడుచుకుని "నాకెందుకే యీ ముద్దులన్నీ? దాచి వుంచు తర్వాత అవసరం అవుతాయి" అంది.

ఆ మాటతో సిగ్గు ముంచుకొచ్చేసి ఫో బామ్మ అంటూ ఒక్కతోపు తోసి వెళ్ళిపోయింది గాయత్రి. బామ్మ తృప్తిగా ఊపిరి పీల్చుకుని గుండెలనిండా నవ్వుకుంది.

వారాలు గడుస్తున్నాయి కానీ ఆ సంగతి ఏం తేల లేదు.

బామ్మ రెండు మూడురోజుల కోసారి వెళ్ళి వస్తుంది.

"సూర్యం దగ్గర్నుంచి ఇంకా జవాబు రాలేదమ్మా" అంటూనే వచ్చారు పరంధామయ్యగారు. అలా అని ఒక రోజున అసలు సంగతి చల్లగా చెప్పారు. "నేనిప్పుడసలు పెళ్ళి చేసుకోను, అందువల్ల నేనిప్పుడు వచ్చి పిల్లను చూసే వ్రిసక్తి లేదు. ఆ గాయత్రికో సావిత్రికో మరో సంబంధం చూసుకోమను వాళ్ళని ఆ వంటా అంటూ రాశాడు. ఏం అబ్బాయిలో, ఏమిటో ఈ రోజుల్లో పిలిచి పిల్లనిస్తాం అంటే మూతి బిగించుకుని కూర్చుంటున్నారు. పోన్లెండి. వాడి తాతలాంటి సంబంధం వస్తుంది మీ గాయత్రికి." అంటూ.

ఇది తెలిసిన గాయత్రి నిరాశతో కుంగిపోయింది.

తన కలలన్నీ కరిగి పోయాయని విచారంలో మునిగిపోయింది. సరదా ఉత్సాహం చిలిపితనం అన్నీ తగ్గిపోయి జీవితంలో ఏదో పోగొట్టుకున్నదానిలా తయా

రయింది. ఎక్కడ కూర్చుంటే అక్కడే కూర్చోవడం పలక రించినా పలక్కపోవడం, ఎప్పుడూ ఏదో ఆలోచన. పర ధ్యానం.

మనవరాలి పరిస్థితిచూసేసరికి బామ్మకి మనస్సంతా వి:లం అయిపోయింది. ఆమెని సూర్యం ధ్యాస నుంచి తప్పించేందుకు శతవిధాల ప్రియత్నంచేసింది. గాయత్రి సూర్యాన్ని మరిచిపోలేక పోతోందని గ్రిహించి దీనికి ఏవిటా మార్గం అని ఆలోచన చెయ్యడం మొదలు పెట్టింది....

రోజు యధాప్రికారం గాయత్రి సంజెవేళ నీళ్ళకని చెరువుకి వెళుతూనే ఉంది. కాని ఆ వెళ్ళడంలో పూర్వపు సంతోషం కాని చలాకితనం గాని ఏం లేవు. కేవలం యాంత్రికంగా వెళ్ళి కాస్సేపు కలువ పువ్వుల్ని చూసి, ఆ చల్లని గాలిలో సేదదేరి కాళ్ళీడ్చుకుంటూ రావడం - అంతే!

ఆ రోజు మామూలుగానే చెరువుకి వెళ్ళింది.

సూర్యం తనని పలకరించడం జ్ఞాపకం వచ్చి ఆ దృశ్యం అప్పటి కప్పుడు జరుగుతున్నట్లు కళ్ళముందు కదులుతూ ఉంటే తనని తాను మరచి ఎంతసేపో కూర్చుండి పోయింది. చెర్లోకిదిగే పావంచాలమీద మామూలుగా బాతులన్నీ జంటలు జంటలుగా వయ్యారాలు పోతూ ఈదుతున్నాయి.

అలా సంతోషంగా ఈదుతూన్న బాతుల మధ్యకి ఎక్కడి నుంచో ఒక ఒంటరి బాతు వచ్చింది. వచ్చి జంటగా వెళ్తూన్న బాతుల్ని తరిమింది. ముక్కుతో పొడిచింది. రెక్కలు టపటప మని కొడుతూ అదిలించి హాయిగా విహరిస్తూన్న బాతుల్ని చిందరవందర చేసింది. అది చూసిన గాయత్రికి కోపం వచ్చింది. "పెద్ద వనున్నట్లు వచ్చి ఎందుకలా తను తక్కిన వాటిని విసిగించడం?" అనుకుంది. వెంటనే సూర్యం జ్ఞాపకం వచ్చాడు. గాయత్రికి మనస్సులో ఏదో ముల్లుగుచ్చుకున్నట్లయింది.

ఇంక ఒక్కక్షణం అక్కడ ఉండలేక, బిందెతో నీళ్ళు ముంచుకొని గబగబా ఇంటికి వచ్చేసింది గాయత్రి.

అప్పుడే బామ్మకూడా గుమ్మంచీడీలు ఎక్కుతూ ఉంది. ఎక్కడికి వెళ్ళివస్తోందో ఏమో గాయత్రిని చూడగానే "పట్నం నుంచి పరంధామయ్యగారి మేనల్లుడు వచ్చాడే!" అంది బామ్మ.

"ఏ పరంధామయ్యగారు?"

"అదేనే.... సూర్యం"

గాయత్రి ముభావంగా 'ఊహుఁ' అని లోపలికివెళ్ళిపోయింది. బామ్మ వెనకాలే వెళ్ళి "ఇప్పటి దాకా పరంధామయ్యగారు మన సంబంధంగురించి నచ్చ చెప్పడానికి

చూశారు. కాని ఆ అబ్బాయి ససేమిరా ఒప్పుకోందే?" అంది.

గాయత్రికి ఆ మాటలు చీకాకుగా ఉన్నాయి.

"ఇపుడెందుకా గొడవ?" అంది విసుగ్గా.

"గొడ వేమిటే? - అమీ తుమీ తేల్చు కోవద్దూ? నేను కూడా అడిగాను. మా గాయత్రిని చూడు నాయనా, నచ్చితే చేసుకోవచ్చా అనీ"

"ఎందు కడిగావు?" చరుగ్గ మంది గాయత్రి.

"అడిగి నంతట్లో అంగీకరించాడేవిటే!.... నే నిప్పు డెవర్నీ చేసుకోనండీ అన్నాడు. పోనీ అని నిజంగా ఎవర్నీ చేసుకోక పోయినా అదోరకం కాని మళ్ళీ అదీ కాదుట...." బామ్మ ఆగింది.

"పోనిద్దూ ఆయనెవర్ని చేసుకుంటే మనకెందుకు?" అంది గాయత్రి విసుగ్గా.

"అది కాదే వాళ్ళ మావయ్య అడగ్గా అడగ్గా చివరికి చెప్పాట్ట ఏమిటోతెల్సా? ఈ ఊళ్ళోనే ఒక ఆ అమ్మాయిని చూశాను చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటాను అని"

"చేసుకోమను- ఎవరు కాదన్నారు? చక్కని చుక్క కాబోలు ఆ అమ్మాయి!" అంది గాయత్రిమాటల్లో ఈర్ష్య కోపం స్పష్టంగా ధ్వనించాయి.

"చక్కని చుక్కో చక్కెర బొమ్మో.... ఆ.... అదీ.... ఎవరా అమ్మాయి అని వాళ్ళ మామయ్య అడిగితే పేరు తెలియదు.... నేను పెట్టిన పేరు మాత్రం చక్కెర బొమ్మ అన్నాట్ట ... విన్నావా? ఎవరో చక్కెర బొమ్మట."

గాయత్రి ఉలిక్కిపడింది....

"ఎవరో మరి ఆ చక్కెర బొమ్మ!" బామ్మ తనలో తను సణుక్కుంది.

గాయత్రికి ఒళ్ళు ఝల్లుమంది.

వెయ్యి వసంతాలు ఒక్క మారు విరిసినట్లు లక్ష సెలయేళ్ళు ఒకే సారి నవ్వి నట్లు, కోటి చంద్రులు ఒక్క సారిగా ప్రకాశించినట్లయింది. మనస్సు పురి విప్పిన నెమలిలా నాట్యం చేస్తూండగా, పెదిమలు విడీ విడకుండా నవ్వుతున్నాయి.

నవ్వుతుని, గుండెల్లోంచి వస్తూన్న ఆనందాన్ని అణచుకోవడానికి ప్రయత్నిస్తూ "బా....మ్మా...." అంది.

బామ్మ ఆమె కంఠంలో వినిపించిన ఆవేగానికి కంగారుపడి "ఏమిటే తల్లీ" అంది ఆందోళనగా.

"ఆ చక్కెర బొమ్మ ఎవరో తెలుసా?" అంటూ పక పకా నవ్వేసి, బామ్మని గట్టిగా కౌగలించుకుని "చెప్పుకో చూద్దాం" అంది గాయత్రి.

బామ్మ ఒక్కక్షణం నివ్వెరపోయి, వెంటనే అర్థం చేసుకుని, ఆనందంతో తల మునకలవుతూ "ఆ సి భడవా నువ్వేనా ఆ చక్కెర బొమ్మవి.... అయితే సరి ఇంకనేం? కానియ్యి శుభలేఖలో నీ పేరు అలాగే యిద్దాంలే. అవును మరి మేం పెట్టుకున్న పేరు గాయత్రీ. అతను పెట్టుకున్న పేరు ఆదీను...." అంది తృప్తిగా వట్టి నోటినే చప్పరించు కుంటూ. సిగ్గుతో నిలబడి పోయిన గాయత్రి ఆ సమయంలో బామ్మ కళ్ళకి నిజంగా చక్కెర బొమ్మలా కన్పించింది.

(మహిళ)